క్లుప్తంగా

డీఆర్ఎం కార్యాలయంలో లిఫ్టులు ప్రారంభం



లక్ష్మీపురం: పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో రెండు నూతన లిఫ్టులను డీఆర్ఎం రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత లిఫ్టులు మరమ్మతుల దృష్ట్యా కొత్త వాటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని సమస్యల్ని ప్రయాణికులు తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అనంతరం లిఫ్ట్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి.సూర్యనారాయణ, సంబంధిత డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగుల సేవలు శాశ్వతం

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధునరసింహారెడ్డి



లక్ష్మీపురం: ఉద్యోగులు ఎన్ని ప్రాంతాలు మారినా, వారు అందించిన సేవలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయని సెంట్రల్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధునరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో ఒకేసారి ఇద్దరు ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు బదిలీ సందర్భంగా బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్ర కుమార్ ధృవ్ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచటానికి ఎంతో కృషి చేశారని, వారి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్ర కుమార్ ధృవ్ మాట్లాడుతూ కమిషనర్ సూచనలతోనే తాము ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. విధి నిర్వహణలో ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. అనంతరం ఇద్దరు ఉన్నతాధికారుల్ని కమిషనర్, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రశాంత్ కుమార్, జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు రవికుమార్, సీతారామరాజు సూపరింటెండెంట్ లు గాదె శ్రీనివాసరెడ్డి, యుగంధర్, మూర్తి, నవీన్, సురేష్, ఈశ్వర్, శాఖమూరి పాల్గొన్నారు.

విదేశీ వర్సిటీల్లో ఉన్నత ఫార్మసీ విద్య



గుంటూరు ఎడ్యుకేషన్: విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఔషధ రంగంలో ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాల్ని అందిపుచ్చుకోవాలని హన్మకొండకు చెందిన క్రిస్టల్ ఓవర్సీస్ కన్సల్టెంట్ సీఈవో డాక్టర్ ఏ.మహేష్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం 'ఫార్మసీ రంగంలో ఉన్నత విద్య-ఉపాధి అవకాశాలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేష్ మాట్లాడుతూ బీఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఐర్లాండ్ దేశాల్లో ఉన్నత విద్య అభ్యాసించేందుకు అందుబాటులో గల కోర్సుల్ని తెలిపారు. అడ్మిషన్ పొందేందుకు కావాల్సిన అర్హతలు, వివిధ వర్సిటీల్లో విద్యార్థులకు అందించనున్న ఉపకార వేతనాలు గురించి వివరించారు. బీఫార్మసీ, ఫార్మాడీ అనంతరం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి హైదరాబాద్‌లోని క్లిన్‌ఫార్మెడ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి. మహేష్ వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం మాట్లాడుతూ సంబంధిత రెండు సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ.ప్రత్యూష, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త డి. బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంట్లో రూ. 2.30 లక్షల చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీ నగర్ 10వ లైనులో నివసించే ఎం.శంకర్ మంగళవారం ఇంటి తలుపులు వేసి బయటకు వెళ్లారు. కొంత సేపటి తరువాత వచ్చి చూసుకోగా బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. అందులోని రూ. 2.30 లక్షలతో పాటు 15 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుల గణనతోనే బీసీల అభ్యున్నతి

బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంవీ రమణయ్య



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కుల గణన చేపట్టాలని బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంవీ రమణయ్య డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని బీసీ ఉద్యోగ సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఓబీసీ రిజర్వేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి శివపూర్ణయ్య మాట్లాడుతూ బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం కుల జనగణన చేపట్టడం ఎంతో ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర కోశాధికారి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ దేశంలో ఏదైనా జాతి, కులం అభివృద్ధి, వెనుకబాటుతనాల్ని గణాంకాల సహా తెలుసుకునేందుకు కుల గణన అవసరమని పేర్కొన్నారు. గౌరవ సలహాదారు దేవ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులు జువ్వా జ్ఞానేశ్వరరావు, బాల తాతయ్య, సాంబశివరావు, సాయి పాల్గొన్నారు.

బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన మండల్

నెహ్రూనగర్: బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బీపీ మండల్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆగస్టు 7న బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన రోజును పురస్కరించుకుని బుధవారం పాత గుంటూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నూటికి 60శాతం ఉన్న బీసీల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం నడిపిన నాయకుడు బీపీ మండల్ అని కొనియాడారు. బీసీల కోసం 40 డిమాండ్లను కేంద్రం ముందుంచగా వాటిలో కొన్నింటిని మాత్రమే అమలు చేశారని తెలిపారు. మిగిలిన వాటిని అమలు చేయాల్సిన అవసరం కేంద్రంపై ఉందని, ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జడ్జీల నియామకంలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

చరిత్రలో భయానక ఘటన హిరోషిమా డే



సమావేశంలో మాట్లాడుతున్న విశ్లేషకులు ముప్పాళ్ల ప్రసాదరావు

లక్ష్మీపురం: చరిత్రలో భయానక ఘటన హిరోషిమా డే అని విశ్లేషకులు, విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో హిరోషిమా డే అనే అంశం పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై 1945 ఆగస్టు 7న అమెరికా జార విడిచిన అణు బాంబుల వల్ల రెండు లక్షల మందికి పైగా చనిపోయారని పేర్కొన్నారు. ఇది చరిత్రలోనే అతిపెద్ద దుస్సంఘటనని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి. సుబ్బారెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు పి.జనార్దనరావు తదితరులు ప్రసంగించారు.

అవినీతి పాలనకు బంగ్లాదేశ్ విద్యార్థులు చరమ గీతం

ప్రజల మనోభావాలు గుర్తించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తే ఎంతటి నేతలకైనా ఎలాంటి దురవస్థ పడుతుందనే దానికి గత రెండు రోజుల బంగ్లాదేశ్ పరిణామాలే నిదర్శనమని విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షేక్ హసీనా అవినీతి పాలనకు బంగ్లాదేశ్ విద్యార్థులు చరమ గీతం పాడారని తెలిపారు.

11న ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహిస్తున్న స్పెషలిస్టుల ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఈనెల 11న 'ప్రోస్టేట్ గ్రంధి వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం- శాస్త్రీయ అవగాహన' సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, పావులూరి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8గంటల నుంచి 12 వరకు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ శిబిరంలో వైద్య, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మొహ్సిన్ కాద్రీ ప్రసంగంతో పాటు వైద్య సలహాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈనెల 31వరకు అతి తక్కువ ఖర్చుతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్‌ఏ), ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రొఫైల్ పరీక్షలను అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక టీంగా ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. క్విజ్ పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ. 5వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతల్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పట్నంబజారు: వ్యక్తి అదృశ్యంపై లాలాపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.నల్లచెరువులో నివాసం ఉండే మీసం సాయి ఐటీసీలో కార్తికేయ మార్కెటింగ్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 6 ఉదయం ఆఫీసుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పిన సాయి తిరిగి రాలేదు. ఆఫీసు బ్యాగులో లెటర్ ఉంది. అందులో ఆఫీసు డబ్బులు చెల్లించలేక వెళ్లిపోతున్నానని, ఐ యామ్ సారీ అంటూ భార్యకు రాసి ఉంది. సాయి భార్య సౌజన్య క్రాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఉన్నతికి కృషి చేయడమే లక్ష్యం

- కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి
- బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థికీ నైపుణ్యతలతో కూడిన విద్యను అందించి వారి ఉన్నతికి కృషి చేయటం తమ కళాశాల లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపి వారిలో సృజనాత్మకతను వెలికితీసి, లక్ష్య సాధన దిశగా తమ కళాశాల కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకూ కళాశాల పొందిన అవార్డులు, ఉపాధి అవకాశాలు వివరించారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళ్లం గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో స్థాపించిన కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు, విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత సాంకేతిక విద్య, ఉపాధి కల్పన ముఖ్య ధ్యేయంగా కళాశాల పనిచేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 1200 మందికి పైగా ఇంజినీరింగ్ డిగ్రీలో ప్రవేశాలు జరిగాయన్నారు. అత్యున్నత సాంకేతిక విద్యను అందిస్తున్న ఏకైక స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి. వెంకటేశ్వరరెడ్డి, ఏట కళ్లం నవ్య, కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.ఎల్. మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్ 4వ లైనుకు చెందిన చిత్రాల శ్రీనివాసరావు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పనిమీద ద్విచక్ర వాహనంపై అడవితక్కెళ్లపాడు నుంచి తిరిగి వస్తుండగా దారి మధ్యలో కుక్క అడ్డు వచ్చింది. సడన్ బ్రేక్ వేయటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు అవ్వడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృత్తి వైద్యం.. ప్రవృత్తి సాయం

- ఐదేళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు
- రూ. 10లకే ఓపీ వైద్యం
- పేదల సేవలో యువనారీస్ హెల్త్ కేర్ ట్రస్టు ఆర్గనైజేషన్



విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షమ సుల్తాన (ఫైల్)

గుంటూరు మెడికల్: ఇల్లాలి ఆరోగ్యమే ఇంటి ఆరోగ్యానికి రక్ష అని ధ్యేయంతో గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ షమ సుల్తాన యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేశారు. యువతులు, మహిళలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహారపు అలవాట్లపై చైతన్యం తీసుకొచ్చేలా ఆర్గనైజేషన్ పట్టణాల్లోని మురికివాడలు, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తోంది. కౌమార దశ బాలికలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, యుక్త వయస్సులో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వాటిని ముందస్తుగా గుర్తించి అధిగమించే విషయాలపై అవగాహన కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తోంది.

గృహిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మహిళలు కుటుంబ బాధ్యతల హడావుడిలో వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించకపోవడం ద్వారా అనేక అనర్థాలకు లోనవుతున్నట్లు గుర్తించి ఆర్గనైజేషన్ ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది. వైద్య శిబిరాలతో పాటు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేస్తోంది. మహిళలకు, యుక్తవయస్సు వారికి ఎదురయ్యే పీసీఓడీ (నీటి బుడగలు), సర్వేకల్ క్యాన్సర్, నెలసరి సమస్యలు, గైనకాలజీ సమస్యలు, హెల్త్ ఎడ్యుకేషన్, డైట్, లైఫ్‌స్టయిల్ మోడిఫికేషన్ తదితర అంశాలపై డాక్టర్ షమ సుల్తాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వెబ్ నర్సు ద్వారా మహిళల ఆరోగ్య సలహాలను యువ నారీస్ హెల్త్ కేర్ యూట్యూబ్ చానల్ ద్వారా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు హోప్‌విన్ హాస్పిటల్‌కు చెందిన స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులతో ఉచితంగా శిబిరాలు ఏర్పాటు చేసి, మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారు. పట్టణాలు, శివారు కాలనీల్లో సైతం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలకు పలు స్వచ్ఛంద సంస్థలు అనేక అవార్డులు, సత్కారాలు అందించాయి.

అందరికీ అందుబాటులో వైద్యం

నామమాత్రపు ఫీజుతో కార్పొరేట్ వైద్య సేవల్ని పేదలకు అందించాలనే ఉద్దేశంతో సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ సహకారంతో గుంటూరులోని హోప్‌విన్ హాస్పటల్‌లో కేవలం రూ. 10లకే ఓపీ వైద్య సేవలు రెండేళ్లుగా అందిస్తున్నాం. సేవ చేయాలనే లక్ష్యంతో ఒక పక్క హాస్పిటల్‌లో నామమాత్రపు ఫీజులతో వైద్య సేవలు అందిస్తూనే, మరోపక్క ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



– డాక్టర్ షమ సుల్తాన, యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు

హెచ్ఐవీ బాధితులకు హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ పరీక్షలు



ఏఆర్టీ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

గుంటూరు మెడికల్: హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే వారు ఉచిత హైపర్ టెన్షన్ పరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడటం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు గోరంట్లలోని ఏఆర్టీ సెంటర్‌లో బుధవారం హెచ్ఐవీ బాధితులకు హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 'సేఫ్ కేర్ సెల్ఫ్ కేర్' అనే నినాదంతో ఏఆర్టీ మందులు వాడే ప్రతి ఒక్కరూ రక్తపోటును పరీక్షించుకోవాలని సూచించారు. ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ ప్రతి రోజూ ఏఆర్టీ మందులు కోసం వచ్చేవారికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హెపటైటిస్ బీ పరీక్షలు చేసి వ్యాధి సోకకుండా అందరికీ ఉచిత టీకా వేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడి వైరస్‌ను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. దీనిపై పోస్టర్లతో ప్రచారంతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్న కుమార్, ఏఆర్టీ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు



తల్లులకు శిశువుల దుస్తులను అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: పాల డబ్బాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా తల్లి పాలకు విలువ ఇవ్వాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రసూతి వార్డులో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో శిశువులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ తల్లి పిల్లలకు పాలునివ్వడం వల్ల మెరుగైన పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. తల్లి పాలు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే పిల్లలకు అందించాలని తెలిపారు.తల్లి పాలు తాగిన పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు. బిడ్డ పుట్టిన ఆరు నెలలువరకు పాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యవంతమైన పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ సేవల్ని అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు పి. రత్నప్రియ, కార్యదర్శి వి. హిమబిందు, పూర్వ అధ్యక్షులు బి. అశోక, బి. రోహిణి, పి. విజయవాణి, సీహెచ్. వాసవి, ఎస్. వాణి పాల్గొన్నారు.

రేపు జిల్లావ్యాప్తంగా 'క్విట్ కార్పొరేట్' డే

వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

లక్ష్మీపురం: క్విట్ ఇండియా డే సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ కార్మిక రైతు సంఘ కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతాంగం సంవత్సరం పాటు ఢిల్లీలో ఆందోళన నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యల్ని పరిష్కరిస్తామని, పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించారని, క్రిమిసంహారక మందుల అమ్మకంలో వ్యాపారస్తులకు అనుకూలమైన విధానం రూపొందించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి ఉపాధి కూలీల పొట్ట కొట్టారని ఆరోపించారు. ఆహార భద్రత విషయంలో కూడా బడ్జెట్లో నిధులు తగ్గించారని తెలిపారు. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదానీ,అంబానీల కోసం పని చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఇండియా డే సందర్భంగా ఆగస్టు 9వ తేదీన క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని వివరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరిగాని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత ప్రదర్శన



చేనేత వస్త్రాలను ధరించిన అధ్యాపకులు, విద్యార్థినులతో ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఆధ్వర్యంలో పెడన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత కార్మికుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలని కోరారు. చేనేత వస్త్రాల ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి విద్యార్థినులతో రీల్స్ చేయిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల జీవితాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థినులకు పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో రూ. లక్ష విలువలైన వస్త్రాలు అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు చేనేత వస్త్రాల్నిధరించి ఆకట్టుకున్నారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు నివాళులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చింతకింది ఖాశీం

నెహ్రూనగర్: కామ్రేడ్ గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి ప్రతిభతో ఉన్నత స్థానానికి ఎదిగారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాశీం పేర్కొన్నారు. ఉన్నత జీవితాన్ని కాదని బి. నరసింగరావు సాన్నిహిత్యంలో కవిగా రూపుదిద్దుకుని సాహిత్య రంగంలో ఉన్నతమైన, ఆదర్శనీయమైన కవిగా ఎదిగారని తెలిపారు. చుండూరు అమర వీరుల 33వ వర్ధంతి సభ, ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను మంగళవారం రాత్రి దళిత, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. సాహితీ విమర్శకులు జి. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ చుండూరు అమరుల విషయంలో ధనిక వర్గం, పెత్తందారులు, అగ్రకుల పార్టీలు న్యాయస్థానాలను సైతం మేనేజ్ చేసి న్యాయం జరగకుండా కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా గద్దర్, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు గంటా ప్రభుదాస్, తాటికొండ నరసింహారావు, వై. కోటేశ్వరరావు(వైకే), పాగళ్ల ప్రకాష్, సాధు మాల్యాద్రి, పాటిబండ్ల కోటేశ్వరరావు, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

మామపై అల్లుడి దాడి

గుంటూరు ఈస్ట్: మామపై అల్లుడు దాడి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కేవీపీ కాలనీలో బుధవారం పి.ఏడుకొండలుపై అల్లుడు బాజీ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.